క్లుప్తంగా

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలను తొలగించి సుఖసంతోషాలు ప్రసాదించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం పరిశీలన



శిక్షణ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న ఈడీ

సి.బెళగల్: మండల కేంద్రంలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జకీర్‌హుసేన్ మంగళవారం తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, మహిళలతో మాట్లాడి కుట్టు మిషన్ శిక్షణ, ఉచిత మిషన్ల పంపిణీ విధానం గురించి వివరించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ రాణెమ్మ, అధికారులు పాల్గొన్నారు.

విధులకు రెగ్యులర్‌గా హాజరుకావాలి



సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

సి.బెళగల్: పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు విధులకు క్రమం తప్పకుండా హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి సూచించారు. మంగళవారం మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో పర్యటించిన ఆమె, సర్పంచ్‌లు శాంతమ్మ, దస్తగిరి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, పరిశుభ్రత పనులను పరిశీలించారు. అనంతరం బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయంలో హాజరు రిజిస్టర్, కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. సమయానికి విధులకు హాజరై, ప్రజల సమస్యల పరిష్కారంలో చురుగ్గా ఉండాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కర్నూలు(రూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని కర్నూలు ఎంపీడీఓ జి. రఘునాథ్ అన్నారు. మంగళవారం గోందిపర్ల పంచాయతీలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. చెత్త సేకరణలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఆ తర్వాత సచివాలయానికి వెళ్లి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వెంకాయపల్లె ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు(రూరల్): నగర శివారులో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు బంతిపూలు, మల్లెపూలతో అలంకరించిన బోనాలు, గుగ్గిళ్లు, పండి వంటలు, భక్షాలు నైవేద్యంగా సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

ట్రిపుల్‌ఐటీ డీఎంలో అవగాహన కార్యక్రమాలు

కర్నూలు సిటీ: స్థానిక ట్రిపుల్‌ఐటీ డీఎంలో మొదటి ఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులతో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ఐపీఎస్ దీపికా పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగహన పెంచుకోవాలని, తెలియని లింక్‌లను ఓపెన్ చేయరాదన్నారు. కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు.



కోడుమూరులో అమ్మకానికి ఉంచిన వినాయక విగ్రహాలు



సి.బెళగల్: డాక్టర్ నాయుడు వీధిలో మండపాన్ని ఏర్పాటు చేస్తున్న యువకులు

పూజకు వేళాయె

- నేటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు
- రూ.3వేల నుంచి రూ.30వేలు పలికిన విగ్రహాలు
- మండపాలకు తరలివెళ్లిన గణనాథులు
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన దుకాణాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలంలో బుధవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రజలు సర్వం సిద్ధం చేసుకున్నారు. పట్టణంలోని వీధుల్లో వినాయక విగ్రహాలను ఉంచేందుకు మండపాలను ఏర్పాటు చేశారు. వాటిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా మంగళవారం పట్టణంలో వినాయక విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. విగ్రహం సైజును బట్టి రూ.3వేల నుంచి రూ.40వేల వరకు పలికాయి. వినాయక విగ్రహాల రేట్లు గత ఏడాది కంటే ఈ ఏడాది పెరిగాయి. అయినప్పటికీ నిర్వాహకులు పోటీ పడి విగ్రహాలను కొనుగోలు చేశారు.

సర్వం సిద్ధం

వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుంచేందుకు గణనాథులను మంగళవారం నిర్వాహకులు తరలించారు. పట్టణంలో ఎక్కడ చూసినా గణనాథులను తరలిస్తున్న వాహనాలు, పూజకు అవసరమైన పూలు, పండ్లు, చెరుకుగడల వంటి కొనుగోలు కోసం వచ్చిన ప్రజల సందడే కనిపించింది.

మూడురోజుల పాటు విశేష పూజలు

పట్టణంలోని సుమారు 200 చోట్ల గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. కొలువుదీరిన గణనాథులకు మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించి ఈనెల 29వ తేదీ శుక్రవారం వెంకటగిరి రోడ్డువైపు గల వినాయక ఘాట్‌లోని బావిలో నిమజ్జనం చేయనున్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక ఉత్సవాలను సర్కిల్ పరిధిలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల ప్రజలు ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడినా రెచ్చగొట్టినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కొలువుదీరేందుకు సిద్ధంగా ఉన్న భారీ గణనాథుడు


పార్వతీ తనయా.. పూజలందుకోవయ్యా

- ఓర్వకల్లులో 94 విగ్రహాలకు అనుమతి

ఓర్వకల్లు: ఆదిదేవుడైన పార్వతీ తనయా.. మాచే పూజలందుకోవయ్యా అంటూ భక్తులు వినాయకుడికి భక్తిశ్రద్ధల నడుమ స్వాగతం పలుకుతున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు మంగళవారం కర్నూలు నగరానికి చేరుకుని ఒక్కో విగ్రహానికి రూ.15–30 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. విగ్రహాలను ట్రాక్టర్లపై కూర్చోబెట్టి, కేరింతలు, బాణసంచా పేలుళ్ల మధ్య స్వగ్రామాలకు తీసుకొచ్చారు. నిర్దేశించిన ప్రదేశాల్లో నిర్మించిన మండపాల్లో బుధవారం ఉదయం వినాయక చవితి పర్వదినం రోజున కొలువుంచి పూజలు చేయనున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 94 విగ్రహాలకు అనుమతులు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందులో అత్యధికంగా నన్నూరు, హుసేనాపురం, ఓర్వకల్లు, ఉయ్యాలవాడ గ్రామాల్లో 8 నుంచి 15 విగ్రహాలను ఏర్పాటు చేయగా మిగతా గ్రామాల్లో 1,2 విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పోలీసుల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ సునీల్‌కుమార్ హెచ్చరించారు. చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకునేందుకు సహకరించాలని నిర్వాహకులను కోరారు.

పాణ్యంలో వినాయక మండపాల సందడి

పాణ్యం: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం నుంచే నిర్వాహకులు మండపాలను సిద్ధం చేసి, వాటిని ఆకర్షణీయంగా అలంకరించారు. బుధవారం పండుగ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలతో గణనాథులను మండపాల్లో ప్రతిష్టించి భక్తులు పూజలు చేయనున్నారు. అనంతరం ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం నిమజ్జనం నిర్వహించనున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ, మండప నిర్వాహకులకు పోలీసులు పలు సూచనలు జారీ చేసి శాంతి భద్రతలపై దృష్టి సారించారు.



భక్తుల చెంతకు చేరిన బొజ్జ గణపయ్య

సి.బెళగల్‌లో పెరిగిన మండపాల సంఖ్య

సి.బెళగల్: వినాయక చవితి వేడుకలకు మండల ప్రజలు మంగళవారం నుంచే ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. గ్రామాలు, వీధులన్నింటిలోనూ వినాయక మండపాలు వెలిసి పండుగ వాతావరణం నెలకొంది. వినాయక ఉత్సవాల ఏర్పాట్లలో నిర్వాహకులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విఘ్నేశ్వరుడి ప్రతిష్ట కోసం చావిళ్లను రంగురంగుల కాగితాలు, విద్యుత్ బల్బులతో అలంకరించుతూ పండుగ సందడిని ఆస్వాదిస్తున్నారు. ఈ ఏడాది వినాయక మండపాల సంఖ్య గతేడాదితో పోలిస్తే ఎక్కువగా నమోదైందని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఓర్వకల్లు: రసాయన ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ విద్యాసాగర్, వ్యవసాయాధికారిణి మధుమతి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కొందరు వ్యాపారులు యూరియా నిల్వవుంచుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా యూరియాను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించినట్లు తెలిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం మండలంలోని బ్రాహ్మణపల్లె, హుసేనాపురం, కాల్వ, కన్నమడకల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు ఆర్‌ఎస్‌కేలను సంప్రదించాలని తెలిపారు. ఒక రైతుకు కనిష్టంగా 1 బస్తా నుంచి 5 బస్తాల వరకు యూరియా అందజేస్తామన్నారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: గురుకుల, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చింతలయ్య అన్నారు. మంగళవారం పాఠశాలలో కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అదే విధంగా మదర్ థెరిస్సా ట్రస్టు సభ్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వైద్య సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాయులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, మదర్ థెరిస్సా ట్రస్టు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు సహకరించాలి

- సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ రఘు

ఓర్వకల్లు: నేత్రదానం చేసి అంధత్వ నివారణకు సహకరించాలని సంచార వైద్య చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ రఘు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుట్టపాడు గ్రామ సచివాలయంలో జరుగుతున్న సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. నేత్ర దానం చేసి అంధత్వ నివారణకు సహకరించాలని కోరారు. మరణానంతరం కళ్లు నశించిపోకుండా ఇద్దరు కార్నియా అంధులకు చూపులను ప్రసాదించాలని సూచించారు. వ్యక్తి మరణించిన 6 గంటల వ్యవధిలోగా కంటి సేకరణ కేంద్రానికి సమాచారం ఇస్తే వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారని తెలిపారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యా సంస్థల్లో విద్యార్థులకు చైతన్యం తీసుకొచ్చేలా కృషి చేయాలని, ప్రజలు మూఢనమ్మకాలు వదలిపెట్టి నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం అన్ని దానాల్లో కంటే గొప్పదానం అని, చనిపోతూ కూడా నేత్రదానం చేసి, చిరంజీవులుగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నేత్రదానం కోసం 9849903116, 9640692299 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సుప్రియ, ఆరోగ్య కార్యకర్త హేమలత, ఆశా వర్కరు నజీమ్, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న రఘు

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ అధికారులు

ఓర్వకల్లు: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ సూచించారు. మంగళవారం ఓర్వకల్లు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇళ్ల నిర్మాణం కోసం రూ.15, 20, 30 వేల అడ్వాన్సులు తీసుకున్నప్పటికీ ఇళ్ల పనులు ప్రారంభించని వారు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ఇప్పటికే నిర్మాణాలు మొదలుపెట్టిన లబ్ధిదారులలో ఎస్సీ, బీసీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కావున లబ్ధిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వర్క్ఇన్‌స్పెక్టర్లు రాము నాయక్, సత్యన్న, సుగుణమ్మ, సీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల సంచారం పెరిగిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన సెంటర్లు, మాంసాహార దుకాణాలు, హోటళ్లు, షాపుల వద్ద వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. గార్గేయపురం గ్రామంలోని మరాఠి గేరి ప్రాంతంలో కొన్ని నెలలుగా పదుల సంఖ్యలో ఉన్న కుక్కలు కాలనీవాసులపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో స్కూల్ పిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గార్గేయపురం బస్టాండ్ వద్ద వీధి కుక్కలు

పత్తిలో సస్యరక్షణ చర్యలు అవసరం



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

కల్లూరు: పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ నంద్యాల, శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, రమాదేవి, నజీరుద్దీన్ అన్నారు. మంగళవారం వ్యవసాయ అధికారులు కల్లూరు మండలం లక్ష్మీపురం, పుసులూరు గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శివరామకృష్ణ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలు, గాలిలో తేమ శాతం అధికంగా ఉండడం వల్ల ముందస్తుగా (మే మాసంలో) విత్తిన పత్తి పంట కాయ పక్వ దశలో ఉన్నందున కాయకుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాయకుళ్లు బాహ్య, అంతర కుళ్లుగా ఏర్పడి పంట దిగుబడిని, పత్తి నాణ్యతను దెబ్బ తీస్తుందన్నారు. తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా, 10 లీటర్ల నీటిలో కలుపుకొని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. పత్తి కాయ, పత్తి మొగ్గ రాలకుండా బొరాక్స్ 300 గ్రాములు ఒక ఎకరాకు విత్తిన 90 నుంచి 110 రోజులకు పిచికారీ చేయాలని సూచించారు. అలాగే ప్లానోఫిక్స్ అనే మందును 1 మీ.లి 5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగులు నివారించవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీఈఓ, వీఏఏలు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

కర్నూలు(రూరల్): పత్తి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కర్నూలు మండల వ్యవసాయ అధికారి రూఫస్ రోనాల్డ్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని జి.సింగవరం, ఎదురూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పత్తి పంటను పరిశీలించారు. గులాబీ పురుగు ఉధృత్తిని గమనించి దాని నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నానో యూరియా వల్ల కలిగే లాభాలను వివరించారు.

వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట పరిశీలన

కోడుమూరు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోడుమూరులో దెబ్బతిన్న పత్తి పంటను మంగళవారం నంద్యాల రీజినల్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, మోహన్ విష్ణువర్ధన్‌రెడ్డి, చైతన్య, మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. ఆగస్టు నెలలో భారీ వర్షాలు కురవడంతో పూతరాలిపోయి, కాయలు మురిగిపోవడంతో పత్తి పంటకు విపరీతమైన నష్టం వాటిల్లింది. దీంతో శాస్త్రవేత్తల బృందం కోడుమూరులో పర్యటించి దెబ్బతిన్న పత్తి పంటలను రైతులతో కలిసి పరిశీలించింది. పత్తి పంటకు సోకే తెగుళ్లు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించింది.

శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలి

సి.బెళగల్: పత్తి పంటల సంరక్షణలో యాజమాన్య పద్ధతులను రైతులు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం పోలకల్ గ్రామంలో జరిగిన ×పొలం పిలుస్తోంది• కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ ఆధ్వర్యంలో నంద్యాల ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పత్తి పంటలను పరిశీలించింది. రైతులకు పంట సంరక్షణ, పురుగు నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించింది. రసంపీల్చే, గులాబిరంగు పురుగుల నివారణకు ఎకరాకు కనీసం 10 లింగాకర్షక బుట్టలు, పసుపు–తెలుపు–నీలం జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని సూచించింది. సామూహికంగా నియంత్రణ కోసం ఎకరాకు 20 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా గులాబిరంగు పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించిన ఏఓ మల్లేష్ కుమార్ పంట బీమా నమోదు ఈనెలాఖరు వరకు అందుబాటులో ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఈఓ హిమబిందు, వీఏఏ శశికాంత్, లలిత, ఎంపీఈఓ వెంకటేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

ఓర్వకల్లు: పత్తి పంటలో కాయ కుళ్ల తెగుళ్లను సస్యరక్షణ చర్యల ద్వారా నివారించుకోవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని కాల్వ, హుసేనాపురం గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ×పొలం పిలుస్తోంది• కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మధుమతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమాదేవి, నజీర్ పాల్గొని పలు సూచనలు చేశారు. జిల్లాలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, మబ్బులు, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల మే నెలలో విత్తిన పత్తి కాయలు పక్వ దశకు రావడంతో కాయ కుళ్లు వ్యాధి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోందని తెలిపారు. ఈ తెగులు దిగుబడిని, నాణ్యతను దెబ్బతీసే అవకాశముందని తెలిపారు. బాహ్య కాయ కుళ్లు నివారణకు 3గ్రా మాంకోజెట్ లేదా 3గ్రా కార్బెండోజోమ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. బాహ్య, అంతర కాయ కుళ్లు నివారణకు 30గ్రా కాపర్ ఆక్సీ క్లోరైడ్, 1గ్రా స్ట్రెప్టోసైక్లిన్‌ను 10లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. కాయలు, మొగ్గలు రాలిపోవడం నివారణకు 300గ్రా బొరాక్స్‌ను విత్తిన 90–110 రోజుల మధ్య పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ భాస్కర్, వీహెచ్‌ఏ శశిదేవి పాల్గొన్నారు.



ఓర్వకల్లు: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పాణ్యం ఫ్లైఓవర్ కింద ఇరుక్కున్న భారీ వినాయకుడు



పాణ్యం ఫ్లైవర్ బ్రిడ్జి కింద ఇరుక్కున్న గణనాథుడు

పాణ్యం: మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ కింద భారీ గణనాథుడి విగ్రహం ఇరుక్కుపోయింది. వినాయక చవితి సందర్భంగా అవుకు మండలం శింగనపల్లెకు చెందిన యువకులు నంద్యాల నుంచి రూ.33 వేల ఖర్చుతో 15 అడుగుల విగ్రహాన్ని తీసుకెళ్తున్నారు. పాణ్యం రైల్వే ట్రాక్ వద్ద కమ్ముల కింద విగ్రహం సరిపోకపోవడంతో మార్గం మళ్లించి పాణ్యం మీదుగా శింగనపల్లెకు తరలించాలని చూశారు. అయితే పాణ్యం ఫ్లైఓవర్ కింద నుంచి తీసుకెళ్తుండగా విగ్రహం ఇరుక్కుపోయింది. నిర్వాహకులు చాలా సేపు ఇబ్బంది పడి జాగ్రత్తగా విగ్రహాన్ని బయటకు తీశారు. అనంతరం నంద్యాల మీదుగా శింగనపల్లెకు తీసుకెళ్లారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- వర్షానికి తడుస్తున్న మందులు



శిథిలావస్థలో ఉన్న పర్ల పశువైద్యశాల

కల్లూరు: మండలంలోని పర్ల గ్రామ పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. గ్రామంలో రెండు సచివాలయాలు ఉన్నాయి. పశువైద్యశాలకు రోజూ 20–30 వరకు ఎద్దులు, గేదెలు, మేకలు, గొర్రెలు వస్తుంటాయి. అయితే ఈ వైద్యశాల రోడ్డుకు రెండు అడుగుల లోతులో ఉండడంతో వర్షాకాలంలో మందులు, ఫ్రిజ్ తడుస్తున్నాయి. భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండడంతో వైద్యులు, సిబ్బంది భయాందోళనతో విధులు నిర్వహించాల్సి వస్తోంది. వర్షం పడినప్పుడు ప్రాంగణం బురదమయంగా మారిపోవడంతో పశువులకు చికిత్స చేయడం కూడా కష్టమవుతోంది. వర్షకాలంలో భవనం గోడల నుంచి నీరు పొటుకు వస్తుందని.. ప్రభుత్వం పట్టించుకోకపోతే భవనం కూలిపోవచ్చని గ్రామస్తులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త పశువైద్యశాల నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పెచ్చులు ఊడి పడిన దృశ్యాలు